సాక్షి కర్నూలు

శనివారం, 14, జనవరి, 2023



శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో హరిదాసు వేషధారణలో కళాకారుడు



ఉత్సవంలో కోలాటం



గ్రామోత్సవంలో కళాకారులు

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 11న నవోదయ ప్రవేశ పరీక్ష

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ప్రవేశానికి ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.సాగరిక పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 2023–2024 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రవేశ పరీక్ష 11వ తేదీ ఉదయం 10.30 నుంచి 1.45 వరకు ఉంటుందని, విద్యార్థులు హాల్‌టికెట్లను తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

నేటి నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు. శనివారం భోగి, ఆదివారం మకర సంక్రాంతి, 16న కనుమ పండుగ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ యార్డు సెక్రటరీ గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రోజుల్లో రైతులు మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావద్దని సూచించారు. 17వ తేదీ నుంచి యథాతథంగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు.

భృంగి వాహనంపై శ్రీశైలేశుడు

- శ్రీశైలంలో కొనసాగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు
- వైభవంగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం
- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు



ఉత్సవంలో నిప్పుతో కళాకారుడి విన్యాసం




భృంగి వాహనధీశులైన భ్రమరాంబ సమేత మల్లికార్జునుడికి గ్రామోత్సవ దృశ్యం

శ్రీశైలం టెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిఅమ్మవార్లకు ఆలయ పురవీధుల్లో నిర్వహించిన గ్రామోత్సవం ఆకట్టుకుంది. స్వామిఅమ్మవార్లను దర్శించుకుని భక్తజనం తరించారు. ఉదయం యాగశాలలోని చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపారు. అలాగే లోక కల్యాణం కోసం చతుర్వేద పారాయణలు, జపాలు, రుద్రపారాయణం చేశారు. అనంతరం ఆగమ శాస్త్రం ప్రకారం మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగివాహనంపై ఉంచి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. గంగాధర మండపం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం నందిమండపం అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, కోలాటలు, కళాకారుల నృత్య ప్రదర్శనలతో గ్రామోత్సవం ఆకట్టుకుంది. భృంగివాహనంపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లను వేలాది మంది భక్తజనం కనులారా దర్శించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు, ఏఈవో హరిదాసు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో నేడు..

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం స్వామిఅమ్మవార్లు రావణవాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారు. రావణవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లకు ఆలయ ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే సంక్రాంతి సందర్భంగా భోగి రోజు శనివారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా సామూహిక భోగిపండ్ల కార్యక్రమం నిర్వహిస్తారు. ఐదేళ్ల వయస్సు కలిగిన చిన్నారులకు భోగి పండ్లు వేసి అర్చకులు ఆశీర్వదిస్తారు.



కోసిగి మండల కేంద్రం సమీపంలో సాగుచేసిన రేగు పండ్ల తోట



కాకినాడలో తయారైన వడియాలు

కరువు నేలలో భోగి భాగ్యాలు

- భోగి పండ్ల వనాలతో ఉపాధి
- వివిధ ప్రాంతాలకు ఎగుమతి
- మార్కెట్లో అ'ధర'హో అంటున్న కోసిగి రేగు పండ్లు

మంత్రాలయం: హిందువులు రేగు (భోగి) పండ్లను సూర్యుడి ప్రతి రూపంగా భావిస్తారు. భోగి పండుగ రోజున గొబ్బెమ్మలపై వీటిని ఉంచి భక్తితో పూజిస్తారు. వీటితో చిన్నారులకు అభిషేకాలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఇంతటి విశిష్టత కలిగిన రేగు పండ్లు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కొందరికి ఉపాధి తోపాటు ఆదాయ వనరుగా మారాయి. వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి.

బదరీ వనాలు

అడవులు అంతరించిపోవడంతో రేగుపండ్ల వనాలు (బదరీ వనాలు) కనుమరుగవుతూ వచ్చాయి. వాతావరణ ఒడిదుడులకు తట్టుకోగల ఈ వనాలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో పలు చోట్ల కనిపిస్తున్నాయి. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో ఇవి దర్శనమిస్తున్నాయి. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండలం నేలకోసిగి, కోల్మాన్‌పేట, కోసిగి, పెద్దకడబూరు మండలం గవిగట్టు, పీకలబెట్ట, ఆదోని మండలం దొడ్డనగేరి, ఆరెకల్లు, ఎమ్మిగనూరు కోటెకల్లు, దేవిబెట్ట, ఆలూరు ప్రాంతాల్లో దాదాపు 150 ఎకరాల్లో వనాలు ఉన్నాయి. కోసిగి మండల కేంద్రం చుట్టూరా 11 మంది రైతుల పొలాల్లో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో వనాలు పెరిగాయి. కోటెకల్లు కొండ ప్రాంతాల్లోనూ దాదాపు 50 ఎకరాల్లో చెట్లు ఉన్నాయి.

కోసిగి టు కాకినాడ

కోసిగిలో సేకరించిన ఎండు రేగు పండ్లను చెన్నై, విజయనగరం, కాకినాడ, తణుకు, విజయవాడ ప్రాంతాలకు ఎక్కువగా తరలిస్తున్నారు. ఏటా 2 వేల బస్తాలకుపైగా ఇక్కడి నుంచి పంపిస్తారు. సహజ సిద్ధంగా పండటం, ఎలాంటి హానికరం లేకపోవడం, తీపిగా ఉండటంతో ఇక్కడి రేగిపళ్లకు డిమాండ్ ఉంటున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. చెన్నైలో కోసిగి రేగుపండ్ల ధర కేజీ రూ.35 పలుకుతోంది. చెన్నై, కాకినాడ, విజయవాడ, తణుకు కేంద్రాల్లో 50 కేజీల బస్తా ధర రూ.1,200 వరకు ఉంటోంది.

సీజనల్ ఉపాధి



ఆరబోసిన రేగు పండ్లు

రేగు పండ్లు ఆదోని డివిజన్ రైతులకు సీజనల్ ఉపాధిగా మారాయి. ఎకరా తోట మీద ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.30 వేల వరకు ఆదాయం వస్తోంది. కోసిగి చుట్టుపక్కల 15 మంది రైతులు, కొండ ప్రాంతాల్లోని వ్యవసాయకూలీలు 50 మందికి పైగా ఈ చెట్లపై ఆధారపడుతున్నారు. అక్టోబర్ నుంచి సంక్రాంతి వరకు సీజన్ ఉంటుంది. ఆదోనికి చెందిన చిట్టి, కోసిగికి చెందిన బసయ్య అనే వ్యాపారులు ఇక్కడి నుంచి కోస్తా ప్రాంతానికి, తమిళనాడు రాష్ట్రానికి రేగు పండ్లను సరఫరా చేస్తున్నారు.

100 గ్రాముల రేగు పండ్లలో ఉండే పోషకాలు..

కార్బొహైడ్రేట్లు	17 గ్రాములు
చక్కెర	5.4–10.5 గ్రాములు
కొవ్వు పదార్థం	0.07 గ్రాములు
పీచు పదార్థం	0.60 గ్రాములు
ప్రొటీన్లు	0.80 గ్రాములు
నీరు	81.6–83 గ్రాములు
థయామిన్(బి1 విటమిన్)	0.02–0.024 గ్రాములు
రైబో ఫ్లేవిన్ (బి2 విటమిన్)	0.02–0.38 గ్రాములు
నియోసిన్ (బి3 విటమిన్)	0.7 - 0.83 గ్రాములు
కాల్షియం	25.6 గ్రాములు
ఇనుము	0.76–1.8 గ్రాములు
పాస్ఫరస్	26.8 మి.గ్రాములు

ఏటా రూ.8 లక్షల లావాదేవీలు



కోసిగి ప్రాంతంలో నేను రేగి పండ్లను సేకరిస్తాను. ఇక్కడి నుంచి తణుకు, కాకినాడ, విజయవాడ, చైన్నై ప్రాంతాలకు ఏటా 800 బస్తాలకుపైగా పంపుతాను. దాదాపు 8 లక్షలకుపైగా వ్యాపారం జరుగుతోంది. కూలీలు, రవాణా చార్జీలు పోనూ ఏటా రూ.2 లక్షల మేర ఆదాయం వస్తోంది. రైతులకు ముందస్తు అడ్వాన్సులు ఇస్తుంటాను. రైతులు, కూలీలకు మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతోంది. – బసయ్య, కోసిగి

ఔషధ గుణాలు


రేగిపండ్లను పేదోడి యాపిల్‌గా అభివర్ణిస్తారు. యాపిల్ పండ్ల కంటే వీటిలో ఎక్కువగానే పోషకాలు ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు. రక్తహీనత నివారణకు ఇవి బాగా పనిచేస్తాయి. కండరాల పటిష్టతకు దోహదపడతాయి. ఎముకలు బలంగా ఉండేందుకు, చర్మ సౌందర్యానికి ఉపయోగపడతాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

వడియాల తయారీ

ఎండు రేగు పండ్లను కాకినాడ, విజయవాడ ప్రాంతాల్లో ఎక్కువగా తీసుకుంటారు. కాకినాడ ప్రాంతంలో వీటితో పచ్చడి, వడియాలు చేస్తారు. కిలో వడియాలు అక్కడ రూ.280 నుంచి 320 వరకు ధర పలుకుతున్నాయి. అక్కడ ప్రత్యేక కంపెనీలు సైతం ఏర్పాటయ్యాయి. రేగు పండ్ల వడియాల తయారీ కుటీర పరిశ్రమగా అభివృద్ధి చెందింది.

మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

- కలెక్టర్ పి. కోటేశ్వరరావు



టిడ్కో ఇళ్ల వద్ద నీటిశుద్ధి ప్లాంటు



ప్లాంటును ప్రారంభిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు, ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ రామయ్య, ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు (టౌన్): నగర ప్రజలకు మంచినీటి ఎద్దడి లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ పి. కోటేశ్వరరావు తెలిపారు. జగన్నాథగట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు నీటిని శుద్ధిచేసే యంత్రాలను శుక్రవారం కలెక్టర్‌తో పాటు కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ నుంచి వచ్చిన నీటిని టిడ్కో పరిసరాల్లో నూతనంగా నిర్మించిన ప్రెషర్ ఫిల్టర్‌లో శుద్ధి చేస్తారన్నారు. ఈ నీటి 3 ఎంఎల్‌డీ ట్యాంకులో నింపి పైప్‌లైన్ ద్వారా నగర ప్రజల అవసరాల మేరకు వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. టిడ్కో ఇళ్ల నుంచి అబ్బాస్ నగర్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు.

బాయ్యన్న చెరువు పరిశీలన

చిన్నటేకూరు సమీపంలోని బాయ్యన్న చెరువును కర్నూలు ఎంపీ, పాణ్యం ఎమ్మెల్యే, మేయర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రశేఖర్, మున్సిపల్ ఎస్ఈ శేషసాయి, డీఈలు రవికుమార్ గుప్త, రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి

కర్నూలు(సెంట్రల్): భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలతో ప్రారంభమైన ఈ ఏడాది మొత్తం ప్రజలు సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ పి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

శిశువులకు టీకాలు తప్పనిసరి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): శిశువులకు తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన కర్నూలు మండలం ఇ.తాండ్రపాడు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డ్స్, రిపోర్ట్స్, ఎంసీహెచ్ ఇండికేటర్స్, ఓపీ రిజిస్టర్, డ్రగ్స్ రిజిస్టర్, ఈసీ డేటా పరిశీలించారు. అనంతరం టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్‌లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముఖ్తర్‌పాష, డాక్టర్ విజయ, డాక్టర్ మాధురి, డాక్టర్ హఫ్స, ఎంపీహెచ్‌ఈవో మక్బూల్ ఉన్నారు.

క్లుప్తంగా

టైరు పేలి అదుపు తప్పిన కారు

● ఎనిమిది మంది క్షేమం



టిప్పర్‌ను ఢీకొన్న కారు

పాణ్యం: తమ్మరాజుపల్లె గ్రామంలో జాతీయ రహదారిపై ఓ కారు టైరు పేలి అదుపు తప్పింది. అదృష్టవశాత్తూ కారులో ఉన్న ఎనిమిది మంది క్షేమంగా బయట పడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఓ కుటుంబం తిరుపతికి బయలు దేరింది. తమ్మరాజుపల్లె గ్రామం వద్దకు రాగానే ముందు టైర్ పేలి రహదారిపై యూటర్న్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్‌ను ఢీకొంది. ఆ తర్వాత సర్వీస్ రోడ్డు దాటి హోటల్ వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను వెనక ఢీకొని ఆగింది. టిప్పర్‌కు ముందు ఓ గొర్రెల మంద, 10 మంది గ్రామస్తులు అక్కడే ఉన్నారు. టిప్పర్ లేకపోతే ప్రాణ నష్టం జరిగి ఉండేది. కారులో ఉన్న మహిళలు, చిన్నారులు క్షేమంగా బయటపడ్డారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

గుడ్డుపై ప్రత్యేక 'కన్ను'

● అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లపై నిఘా
● ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా చేరాలన్నదే లక్ష్యంగా చర్యలు
● నెలకు మూడు రంగుల్లో సరఫరా చేస్తున్న ప్రభుత్వం
● ఏ రంగు గుడ్లు ఆ రోజుల్లోనే అందించాలని ఆదేశం

కర్నూలు(రాజ్‌విహార్): పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల్లో కోడిగుడ్డుకు ప్రత్యేక స్థానం ఉంది. కంటి చూపునకు మేలు చేయడంతో పాటు రక్త హీనత నివారించడం, ఎముకల్లో బలం చేకూర్చడం, మనిషికి కావాల్సిన విటమిన్లు అందించేందుకు ఇది ఎంతో మేలు చేస్తుంది. అలాంటి గుడ్డును పేదలు కొని, తినలేని పరిస్థితిని గమనించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా అందిస్తోంది. చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు ఉడికించి వీటిని ఇస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో సరైన సరఫరా లేదని, ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో గుడ్ల సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించింది.

ప్రతి రోజూ 1.91లక్షల మందికి గుడ్లు

జిల్లాలోని తొమ్మిది ప్రాజెక్టుల్లో 1,886 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఇందులో 1,91,440 మంది లబ్ధిదారులు సేవలు పొందుతున్నారు. ఇందులో 6 నెలల నుంచి మూడేళ్ల మధ్య చిన్నారులు 1,05,871, మూడు నుంచి 6 ఏళ్ల మధ్య పిల్లలు 50,446, గర్భవతులు 19,436, బాలింతలు 15,688 మంది ఉన్నారు. వీరికి ప్రతి రోజూ (సెలవు రోజు మినహాయించి) ఒకటి చెప్పున మొత్తం 1.91 లక్షల మందికి ప్రభుత్వం గుడ్లు సరఫరా చేస్తోంది.

మూడు రంగుల్లో సరఫరా

కోడి గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంచితే పాడవుతాయి. ఒకసారి వచ్చిన గుడ్లను నెల పొడవునా సరఫరా చేయడం, అవి కుళ్లిపోతున్న విషయాలు గ్రహించిన ప్రభుత్వం ప్రతి నెలా పది రోజులకు ఒక రంగు చిహ్నంతో మూడు రంగుల్లో సరఫరా చేయాలని నిర్ణయించింది. 1–10 తేదీల మధ్య బ్లూ, 11–20 మధ్య పింక్, 21 నుంచి నెలాఖరు వరకు గ్రీన్ రంగు ఉన్న గుడ్లు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

నెలకు 43.50 లక్షల గుడ్లు సరఫరా

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు పొందుతున్న లబ్ధిదారుల కోసం నెలకు 43.50 లక్షల గుడ్లు సరఫరా అవుతున్నాయి. ప్రైవేట్ ఏజెన్సీ చిత్తూరు జిల్లా నుంచి వీటిని తెప్పించి కర్నూలు జిల్లా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తోంది. కర్నూలుతో పాటు కోడుమూరు, ఆదోని, ఎమ్మిగనూరు,



బాలింతకు గుడ్లు అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం, పత్తికొండలో గోడౌన్లు ఉన్నాయి.

విజిలెన్స్ విచారణ జరుపుతామన్న మంత్రి బుగ్గన

అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో సక్రమంగా సరఫరా చేయడం లేదని, ఒక రంగుకు బదులు మరో రంగు గుడ్లను అందిస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై మంత్రి తీవ్రంగా స్పందించారు. తీరు మారకపోతే విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తనిఖీ చేయాలని ఆదేశాలు ఇచ్చాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్న ప్రతి లబ్ధిదారుడికి గుడ్లు అందించాలని ఆదేశించాం. వైఎస్సార్ పోషణ కిట్లు నాణ్యతతో ఇచ్చేలా చర్యలు చేపట్టాం. గోడౌన్లలో గుడ్లను తనిఖీ చేయాలని పీడీలు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు ఆదేశాలు ఇచ్చాం.



– పద్మజ, ఆర్‌జేడీ, కర్నూలు

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

District sponsor
GPCET Pioneering Innovative Education

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది. జిల్లా స్పాన్సర్‌గా జి. పుల్లారెడ్డి కాలేజ్‌ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వ్యవహరిస్తోంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.
జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9010299071

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

విద్యార్థుల మృతదేహాలు లభ్యం





మృతి చెందిన ఇమామ్ హుసేన్, బాల వెంకటేశ్వర్లు

గోస్పాడు: జిల్లెల్ల గ్రామ సమీపంలోని కేసీ కాల్వలో గురువారం గల్లంతైన విద్యార్థులు శుక్రవారం శవమై తేలారు. గ్రామానికి చెందిన ఇమామ్ హుసేన్(12), బాల వెంకటేశ్వర్లు(14) గురువారం కాల్వ సమీపంలో బహిర్భూమికి వెళ్లారు. ఇమామ్ హుసేన్ ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోవడంతో పక్కనే ఉన్న బాల వెంకటేశ్వర్లు కాపాడేందుకు దూకాడు. ఇద్దరూ గల్లంతు కావడంతో కుటుంబీకులు కాల్వ వెంబడి గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఇద్దరి మృతదేహాలు గల్లంతైన ప్రాంతానికి సమీపంలోనే లభ్యమయ్యాయి. ఇద్దరు విద్యార్థుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సంజీవరాయుడు తెలిపారు.

కేసీలో పడి మహిళ మృతి



సువర్ణమ్మ (ఫైల్)

పగిడ్యాల: ప్రమాదవశాత్తు కేసీ కెనాల్‌లో పడిన ఓ మహిళ మృతి చెందింది. పగిడ్యాలకు చెందిన గొల్ల గోకారి భార్య సువర్ణమ్మ(45) గురువారం ఉదయం వరి పొలానికి పిట్టల కావలి వెళ్లింది. సాయంత్రం పొలం నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా కేసీ కెనాల్ మెట్ల వద్ద కాళ్లు కడుక్కోవడానికి దిగి ప్రమాదవశాత్తూ నీటిలో పడింది. సమాచారం అందుకున్న కుటుంబీకులు సువర్ణమ్మ ఆచూకీ కోసం గాలించారు. శుక్రవారం ఉదయం పాములపాడు మండలం జూటూరు వద్ద మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసి అంత్యక్రియలు పూర్తి చేశారు.

వార్డు సచివాలయంలో ఆకస్మిక తనిఖీ



సచివాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తున్న హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిష్‌కుమార్ గుప్తా

కర్నూలు: బి.క్యాంప్‌లోని 56వ వార్డు సచివాలయాన్ని హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిష్ కుమార్ గుప్తా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం బి.క్యాంప్‌లోని పోలీస్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆయన సమీపంలోని వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి ఎనిమిది అంశాలపై ఆరా తీశారు. నెలలో రెండు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేయాలనే నిబంధన మేరకు సీనియర్ ఐపీఎస్ అధికారి హరిష్‌కుమార్ గుప్తా కర్నూలులో పర్యటించారు. మహిళా దిశా పీఎస్ డీఎస్పీ వెంకటరామయ్య, మూడో పట్టణ సీఐ తబ్రేజ్ ప్రొటోకాల్ విధులు నిర్వహించారు.

గుర్తు తెలియని యాచకుడు మృతి



కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. ప్రయాణికులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని కలుగొట్ల వద్ద యాచకుడు ఆర్టీసీ బస్సెక్కి కోవెలకుంట్ల పట్టణానికి చేరుకున్నాడు. బస్టాండ్‌లో దిగి నడుచుకుంటూ వెళుతూ కుప్పకూలి మృత్యువాత పడ్డాడు. సుమారు 60 సంవత్సరాలు పైబడి తెల్లటి చొక్కా, పంచె ధరించి ఉన్నాడు. మృతుడి ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది మృతదేహాన్ని ఖననం చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

● ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మోసపోయి బలవన్మరణం



ఇంద్రసేనారెడ్డి మృతదేహం

రాజంపేట(అన్నమయ్య జిల్లా): మండలంలోని బోయనపల్లెలో ఇంజినీరింగ్ విద్యార్థి ఇంద్రసేనారెడ్డి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తాను నివసిస్తున్న గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. నంద్యాల జిల్లా శ్రీశైలంకు చెందిన ఈ విద్యార్థి బీటెక్ మెకానికల్ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. బలవన్మరణం చేసుకునే ముందు తండ్రికి లేఖ రాశాడు. థర్డ్‌పార్టీ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయానని, అందుకే ఆత్మహత్య చేసుకొని చనిపో తున్నానని ఆ లేఖలో పేర్కొన్నాడని రూరల్ ఎస్‌ఐ భక్తవత్సలం తెలిపారు. తండ్రి కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పెద్దాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, సంబంధీకులకు అప్పగించారు. తోటి విద్యార్థులు స్నేహితుని మృతదేహాన్ని చూసేందుకు పెద్దాసుపత్రికి తరలివచ్చారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం



మృతి చెందిన చిన్న సుబ్బారెడ్డి

అవుకు: పట్టణానికి చెందిన రైతు దప్పిలి చిన్న సుబ్బారెడ్డి (40) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకు ఉన్న మూడు ఎకరాల భూమితో పాటు మరో 10 ఎకరాలను కౌలుకు తీసుకొని వివిధ రకాల పంటలను సాగు చేశాడు. పంటల సాగులో ఆశించినంత దిగుబడి రాక రూ.15 లక్షలు నష్టపోయాడు. అప్పులను ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురై గురువారం రాత్రి తాడిపత్రి రహదారిలోని చెరువు కట్ట సమీపంలో పురుగు మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బనగానపల్లె ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, 12 ఏళ్ల కుమారుడు, పదేళ్ల కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

పది నిమిషాల్లో ఉడికిన కందిపప్పు

● ఎల్లో మీడియాలో అసత్య ప్రచారం



ఉడికిన కందిపప్పును పరిశీలిస్తున్న డీఎస్‌ఓ

కర్నూలు(సెంట్రల్)/నంద్యాల(అర్బన్): పౌర సరఫరాల శాఖ ఆధ్వ ర్యంలో పంపిణీ చేస్తున్న కందిపప్పుపై ఉడకడం లేదని ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో స్వయంగా డీఎస్‌ఓ రాజారాఘువీర్, ఐసీడీఎస్ సీడీపీఓ అనురాధ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని ఖండేరి అంగన్‌వాడీ కేంద్రంలో కందిపప్పు వండి పిల్లలకు వడ్డించారు. పది నిమిషాల్లోనే పప్పు ఉడికింది. ఎల్లో మీడియా చేస్తు న్న ప్రచారం అవాస్తమని తేలిపోయింది. నంద్యాల పట్టణంలోని 73వ చౌక ధరల దుకాణంలో కందిపప్పు నాణ్యతను నిపుణుల బృందం శుక్రవారం లబ్ధిదారుల సమక్షంలో పరిశీలిలించింది. నాణ్యతలో ఎటువంటి తేడా లేదని నిపుణులు నిర్ధారించారు.

ఉద్యోగుల ఆన్‌లైన్ చెల్లింపులకు రెండంచెల భద్రత

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగుల ఆన్‌లైన్ చెల్లింపులకు రెండంచెల భద్రతా వ్యవస్థ అమల్లోకి వచ్చిందని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో వివిధ శాఖల డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంటు అధికారుల(డీడీవోల) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీడీవోలు తమ పరిధిలోని ఉద్యోగులకు ఆధార్ ఈ–కేవైసీ చేయించుకోవడాన్ని ఈ నెల 20లోపు పూర్తి చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ సీఎఫ్‌ఎంఎస్ ఐడీని ఆధార్, మొబైల్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలన్నారు. సీఎఫ్‌ఎంఎస్/హెర్బ్ అప్లికేషన్‌లో సురక్షితంగా లాగిన్ కావడానికి ఆధార్ అనుసంధానమైన మొబైల్ ఫోన్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ) తప్పనిసరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీవో జయలక్ష్మి, ఎస్‌టీవోలు అంజాద్‌పాషా. సీఎఫ్‌ఎంఎస్ సీనియర్ అకౌంటెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె పెళ్లి చూడకుండానే..

● రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం



లక్ష్మీనరసింహులు మృతదేహం

బనగానపల్లెరూరల్: మరో పది రోజుల్లో కుమార్తె పెళ్లి.. కుటుంబీకులందరూ ఏర్పాట్లలో ఉండగా అంతలోనే ఆ ఇంట విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో పెళ్లి కుమార్తె తండ్రి దుర్మరణం చెందాడు. రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన కొత్తపల్లె లక్ష్మీ నరసింహులు(47), చిన్న ఓబుళమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె లక్ష్మీ ప్రసన్నకు బెంగళూరుకు చెందిన యువకుడితో ఈనెల 22న వివాహం నిశ్చయమైంది. వివాహం బెంగళూరులో జరుగుతుండటంతో బంధువులు అంత దూరం రాలేరని, ఈనెల 26న నరసాపురంలోనే వివాహ రిసెప్షన్ నిర్ణయించారు. ఈ మేరకు వివాహ రిసెప్షన్ పత్రికలను ఇచ్చేందుకు శుక్రవారం ఉదయం బైక్‌పై పలుకూరు చేరుకున్నాడు. అక్కడ బంధువులకు ఇచ్చిన తర్వాత బేతంచెర్లకు వెళ్తుండగా మార్గమధ్యలో రామకృష్ణాపురం గ్రామ క్రాస్ రోడ్డు వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న నందివర్గం పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై విస్తృత అవగాహన

● 23 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో కార్యక్రమాలు

కర్నూలు(అగ్రికల్చర్): చిరుధాన్యాల సాగుపై ఏడాది పొడవునా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ అధికారులు కార్యక్రమాల క్యాలెండర్‌ను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం(ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్–ఐవైఎం)గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూడా చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ఉద్యమ తరహాలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి రైతుభరోసా కేంద్రంలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ మధ్యాహ్న భోజనం కింద చిరుధాన్యాల ఆహారం ఇవ్వనున్నారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ వంటి పోటీలు జరపనున్నారు. సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయడంతోపాటు 250 ఎకరాల్లో వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసి సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సబ్సిడీలు కూడా ఇస్తారు. చిరుధాన్యాల్లో రెండు రకాలు ఉంటాయి. మేజర్ మిల్లెట్స్‌లో జొన్న, సజ్జ, మైనర్ మిల్లెట్స్‌లో కొర్రలు, రాగులు, ఊదలు, ఆరికలు, అండుకొర్రలు, సామలు ఉంటాయి. జిల్లాలో ఇప్పటికే మేజర్ మిల్లెట్స్ అయిన జొన్న, సజ్జ సాగులో ఉన్నాయి. మైనర్ మిల్లెట్ అయిన కొర్ర మూడు దశాబ్దాల క్రితం వరకు జిల్లాలో ప్రధాన పంటగా ఉండేది. వరి సాగు పెరిగిన తర్వాత దీని వినియోగం తగ్గుతూ వచ్చింది. దీంతో జిల్లాలో కొర్ర సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అవగాహన కల్పించండి

ఆలూరు: రైతులకు చిరుధాన్యాల సాగుపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి (డాట్) కేంద్రం శాస్త్రవేత్త సుజాతమ్మ సూచించారు. స్థానిక ఏఓ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హంపిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఓలు సురేష్ బాబు, శశిధర్‌రెడ్డి, ఏఈఓలు యోగేంద్ర, రంగన్న, జయరాం పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ యార్డు ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్ఠం	గరిష్ఠం
వేరుశెనగ	4887	7691
పొద్దుతిరుగుడు	3009	4619
ఆముదం	3089	6391
వాము	1110	15662
ఉల్లి	1175	1175
ఎండు మిర్చి	2600	35008
కందులు	2020	7400
మొక్కజొన్న	2010	2147
మినుములు	6559	6559

ఆదోని మార్కెట్ యార్డు ధరలు

పత్తి	5,467	8,689
వేరుశనగలు	4,888	7,439
ఆముదాలు	5,433	6,418
పూల విత్తనాలు	5,226	5,696
కందులు	5,811	6,971



క్లుప్తంగా

ఎన్‌టీఎఫ్ గౌరవ అధ్యక్షుడిగా మోటా సురేష్



కర్నూలు (అర్బన్): నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మోటా సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ ఫెడరే షన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల రాముడు ఉత్తర్వులు జారీ చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో గౌరవ అధ్యక్షుడిగా నియమించారని, రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని మోటా సురేష్ చెప్పారు.

జాతీయ నాటక పోటీలకు ‘శ్రీకృష్ణ కమలపాలిక’ ఎంపిక

కర్నూలు కల్చరల్: మిర్యాలగూడ సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో 2023 మార్చిలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పద్యనాటక పోటీలకు ‘శ్రీకృష్ణ కమలపాలిక’ ఎంపికైనట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. ఈ మేరకు నిర్వాహకులు సమాచారం అందించారని పేర్కొనారు. నాటకానికి రచన పల్లేటి కులశేఖర్, దర్శకత్వం పత్తి ఓబులయ్య చేస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం సినీ రచయిత బుర్రాసాయి మాధవ్ నిర్వహించిన పోటీల్లో ఈ నాటకం వెండి వీణ అందుకుందని తెలిపారు. నాటకంలోని కళాకారులను కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, సంగా ఆంజనేయులు అభినందించారు.

వృద్ధాశ్రమాలకు దుప్పట్ల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్) : లయన్స్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ సభ్యుడైన లయన్ బుచ్చన్న (ఆడిటర్) తండ్రి లయన్ నరసయ్య జ్ఞాపకార్థం నగరంలోని పలు వృద్ధాశ్రమాల్లో దుప్పట్లు పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న నిరాశ్రయుల కేంద్రం, మన వృద్ధాశ్రమం, తాండ్రపాడులోని సెరుడ్స్ సంస్థ నిర్వహిస్తున్న కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ ప్రభాకర్, ట్రెజరర్ శ్రీకాంత్, బుచ్చన్న, డాక్టర్ బాలమద్దయ్య, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు యాదవ్, రమణగౌడ్, రామ్‌రాజ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



బసవేశ్వర స్వామి దేవాలయంలో..

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక బుధవారపేటలో ఉన్న బసవేశ్వర స్వామి దేవాలయంలో వీర శైవ భక్తులు శుక్రవారం ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు.కార్యక్రమంలో భక్తులు యాగంటేశ్వర స్వామి, వీరన్న, నాగరాజు శెట్టి, వీరశేఖరప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(సెంట్రల్): 2023 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలుసంఘాలు రూపొందించుకున్న క్యాలెండర్లను శుక్రవారం అతిథులు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఆసంఘం రాష్ట్రకార్యదర్శి ఎస్.మునెప్ప, నాయకులు మనోహర్‌మాణిక్యం, చంద్రశేఖర్, ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం 2023 క్యాలెండర్‌ను పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య ఆవిష్కరించారు.

ఆప్‌కాస్‌లో చేర్చాలి

కర్నూలు(సెంట్రల్): మోడల్‌స్కూళ్లలో డైలీ వేజ్ కింద పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్ట్ బేసిక్‌లోకి తీసుకొచ్చి ఆప్‌కాస్‌లో చేర్చాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు రమేస్‌బాబు, ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ హాస్టల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.


రేపు సంక్రాంతి సంబరాలు

కర్నూలు కల్చరల్: సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండలి కార్యదర్శి మహాబలేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి అంబులెన్స్ సర్వీసు

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబులెన్స్ సర్వీసు శనివారం నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తోంది. శనివారం అంబులెన్స్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు ప్రారంభిస్తారని ఆ సంఘం కన్వీనర్ శేషయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

అన్నదాన పథకానికి విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ అధికారి

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన జి.రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సమేతంగా రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందించారు. దాతకు దేవస్థానం తరపున స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు.

కులవృత్తులకు ప్రభుత్వం అండ

- ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



ఉస్మానియా కాలేజీ ఏరియాలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): కుల వృత్తులు, చేతు వృత్తిదారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలబడుతోందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన 10వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా కాలేజీ ఏరియాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం మూడున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. వెంకటేశ్వర్లు అనే రజకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పొందిన ప్రయోజనాన్ని గుర్తు చేసుకుని ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. తన లాండ్రీ షాప్‌నకు 150 యూనిట్ల వరకు కరెంట్ ఫ్రీగా ఇస్తున్నారని చెప్పారు. గతంలో నెలనెలా రూ.700పైగా బిల్లు వచ్చేదని ఇప్పుడా ఆ సమస్య లేదన్నారు. తమ లాంటి బీదలకు సాయం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి కూడా సీఎం కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. కుల వృత్తులు, చేతి వృత్తిదారులకు వివిధ పథకాల ద్వారా నేరుగా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యూనుస్, నాయకులు పర్వేజ్, నజీర్, సోహెల్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఆడపిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులు కమిటీ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సభ్యులు పరిశీలించి అనంతరం డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రజలు, ఎన్‌జీఓల సహాయంతో డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ విజయానందబాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఎన్‌జీవో ప్రతినిధులు కె. శ్రీనివాసులు, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఈ పద్మావతి, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

17 నుంచి జిల్లా స్థాయి శాప్ లీగ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి జిల్లా స్థాయి శాప్ లీగ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఓపెన్–టు–ఆల్ పురుషుల 7 ఏ సైడ్ ఫుట్‌బాల్ పోటీలు, 18 వ తేదీ అండర్–13, అండర్–17 విభాగాల్లో టేబుల్ టెన్నిస్, అండర్–19 విభాగంలో జూడో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విజేతలకు అభినందన



పతకాలు సాధించిన వెయిట్‌లిఫ్టర్లను అభినందిస్తున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ

కర్నూలు (టౌన్): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి శాప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు రన్నర్స్‌గా, బాలికల జట్టు మూడో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో పుష్పాంజలి (71 కేజీలు) బంగారు పతకం, స్వప్న (81 కేజీలు) వెండిపతకం, చెన్నమ్మ (81) కాంస్య పతకాలు సాధించారు. బాలుర విభాగంలో తయ్యబ్ (102 కేజీలు) బంగారు పతకం, ఇస్మాయిల్ (102 కేజీలు) కాంస్య పతకం, గురు చిద్విలాస్ (81 కేజీలు) కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన వెయిట్ లిఫ్టర్లను శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ హాలులో అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ, మైనార్టీ శాఖ అధికారి మహబూబ్‌బాషా, సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ షేక్ యూసుఫ్ బాషా పాల్గొన్నారు.

ప్రజల మద్దతు లేకే పొత్తులకు పాకులాట

- వచ్చే ఎన్నికల్లో పవన్ ఓటమి ఖాయం
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్‌చంద్రబోస్



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు (అర్బన్): ప్రజల మద్దతు లేకనే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పొత్తుల కోసం పాకులాడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవడం బహిరంగ సభల్లో మాట్లాడినంత సులభం కాదన్నారు. రానున్న ఎన్నికల్లో పవన్ కల్యాణ్‌ను ఓడించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన ఒక సామాన్యుడు చాలునని చెప్పారు. జనాదరణ కలిగిన వైఎస్ జగన్ గురించి మాట్లాడేటప్పుడు పవన్ కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. సినీహీరో కాబట్టే ఆయన మీటింగ్‌లకు ప్రజలు వస్తున్నారే తప్ప ఆయన ఏదో గొప్ప నాయకుడని రావడం లేదన్నారు. తాను ముఖ్యమంత్రి అవుతానన్న భ్రమలను పవన్ కల్యాణ్ పక్కనబెట్టి ముందు ఎమ్మెల్యేగా గెలవాలన్నారు. కుట్రలు, కుతంత్రాలు చేయడంలో దిట్ట అయిన చంద్రబాబును నమ్ముకుని పవన్ పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నారన చెప్పారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కలిసి వచ్చినా ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. ప్రజల సంపూర్ణ ఆశీస్సులతో వైస్ జగన్ రెండోసారి కూడా ముఖ్యమంత్రి అవుతారన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో అవసరం

కర్నూలు (టౌన్): ఆత్మరక్షణకు తైక్వాండో వంటి క్రీడలు అవసరమని సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ వాసురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పెద్దమార్కెట్ లక్ష్మీ కళ్యాణ మండపంలో తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ చిన్నతనం నుంచే మార్షల్ ఆర్ట్స్ వైపు పిల్లలను ప్రోత్సహించాలన్నారు. దీని వల్ల మానసిక వికాసం కలుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు, వీరేష్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి



ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలతో ఎస్టీయూ నాయకులు



కల్లూరు ఆదిత్య విద్యా నిలయంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సలాంఖాన్ భవనం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె. జనార్ధన్, ఆర్థిక కార్యదర్శి రాంమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు పర్వదినాలు

కర్నూలు కల్చరల్: సంస్కృతికి ప్రతిబింబాలు పర్వదినాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కల్లూరు ఆదిత్య విద్యా నిలయంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ పిల్లలకు సంస్కృతి సంప్రదాయాలను నేర్పాలన్నారు. సమితి సభ్యులు వసంతలక్ష్మి, లలిత, భవాని, అనురాధ, ఉమాదేవి, పూర్ణోదయ, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

హాకీ పోటీల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): ఈనెల 14 నుంచి 16 వరకు నంద్యాల పట్టణంలో నిర్వహించనున్న 13 వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటాలని జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి దాసరి సుధీర్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిల్ హైస్కూల్‌లో జిల్లా జూనియర్ హాకీ బాలుర జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ వెలుగులోకి వచ్చే చాంపియన్‌షిప్ పోటీలను క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం

20న చేతివృత్తిదారుల రౌండ్ టేబుల్ సమావేశం

కర్నూలు(సెంట్రల్) : చేతి వృత్తిదారులకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను అభివృద్ధి, సంక్షేమానికి వినియోగించాలని కోరుతూ ఈనెల 20వ తేదీన జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురుశేఖర్ తెలిపారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఆ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజు అధ్యక్షతన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వృత్తి సంఘాల సీనియర్ నాయకులు జి.రామకృష్ణ, గోవిందు పాల్గొన్నారు.

రవాణా రంగంపై కేంద్రం భారం

కర్నూలు : రవాణా రంగంపై భారం వేస్తూ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. పెనాల్టీలు, గ్రీన్ ట్యాక్స్, చలానా ఫీజులు, భారీ అపరాధ రుసుముల ద్వారా రవాణా రంగంపై అదనపు భారం పడుతుందన్నారు. దీనిపై ఆ సంఘం నాయకులు శుక్రవారం రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ బిల్లును అమలు చేయరాదన్నారు. పెరిగిన ధరలు అమలులోకి వస్తే లారీ ఓనర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. త్రైమాసిక పన్ను పెంచాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.రాధాకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రియాజ్, కె.ప్రభాకర్, రాధాకృష్ణ, హుసేన్ వలి, మాలిక్ బాషా తదితరులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు

కర్నూలు (టౌన్): క్రీడా పోటీలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, స్పోర్ట్స్ కన్వీనర్ శంకర్ అన్నారు. నగరంలోని స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వారు మాట్లాడుతూ ఐక్యత కోసం ఆటలు– యువత మైత్రికి బాటలు అన్న నినాదంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జీవోను రద్దు చేయాల్సిందే

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ఆర్‌టీ నంబర్ ఒకటిని రద్దు చేయాలని, అప్పటి వరకు తాము పోరాటాలు కొనసాగిస్తామని వివిధ పార్టీల నాయకులు అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, టీడీపీ, సీపీఎంఎంఎల్, పీఓపీ, వివిధ కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హాజరయ్యారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్ మాట్లాడుతూ..రోడ్లపై సభలు నిషేధించడమంటే ప్రశ్నించే గొంతుకలను అనచి వేయడమేనన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

కర్నూలు : జొహరాపురంలోని మాబుసుభాన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ జాఫర్ ఖాన్ (48) కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించే ఈయన ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో మెట్లు ఎక్కుతుండగా కాలు జారి కింద పడ్డాడు. నుదుటిపై తీవ్ర గాయమై ముక్కులో నుంచి రక్తస్రావమైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక శుక్రవారం మృతిచెందాడు. ఈయనకు కొడుకు, కూతురు సంతానం. భార్య షమీమ్ ఖాతూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

కర్నూలు : పాతబస్తీలోని చిత్తారి వీధిలో ఉన్న ఏటీఎం కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. శుక్రవారం తెల్లవారుజామున ఏటీఎం కేంద్రంలో చొరబడి మిషన్‌కు ఉన్న స్క్రూలను తొలగించే ప్రయత్నం చేయగా అలారం మోగింది. దీంతో దుండగుడు పారిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గస్తీ పోలీసులు ఆ ప్రాంతంలో కలియదిరిగి దొంగ కోసం గాలించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



వాసవీనగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, రాజకీయాలకు, మతాలకు, కులాలకు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధిలోని గురు రాఘవేంద్ర నగర్, వాసవీనగర్‌లలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి చిత్రంతో ఉన్న బుక్‌లేట్‌లను లబ్ధిదారులకు అందించి వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఏదైనా పథకం పొందాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకుల అండదండలు తప్పనిసరిగా ఉండాలన్నారు. తమ ప్రభుత్వంలో అలాంటి వాటికి చోటు లేదన్నారు. దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రెండోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంతరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. హనుమంతురెడ్డి, వార్డులోని స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

తలసీమియా, సికిల్‌సెల్ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం



తలసీమియా చిన్నారులు, వారి తల్లిదండ్రులతో కేంద్రం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కమలా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఫర్ తలసీమియా అండ్ సికిల్‌సెల్ పేషెంట్స్(టీఎస్‌సీఎస్) శుక్రవారం కర్నూలులో ప్రారంభమైంది. హైదరాబాద్‌కు చెందిన టీఎస్‌సీఎస్ తన కొత్త కేంద్రాన్ని స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులోని హెచ్‌డీసీటీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేశారు. కర్నూలుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో తలసీమియా పిల్లల సంరక్షణ కోసం కేంద్రం లేదు. ఇలాంటి సమయంలో తలసీమియా నిర్మూలన కోసం పనిచేస్తున్న టీఎస్‌సీఎస్ ఇప్పుడు కర్నూలులో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందని కర్నూలు కేంద్రం అధ్యక్షుడు చంద్రకాంత్ అగర్వాల్ చెప్పారు. తలసీమియా ఒక జన్యుపరమైన రక్త రుగ్మత అని, ప్రతి గర్భిణి తనంతట తానుగా పరీక్ష చేయించుకుంటే తలసీమియా పిల్లల పెంపకం, సంరక్షణలో జీవితకాలాన్ని పెంచవచ్చన్నారు.టీఎస్‌సీఎస్ ఇప్పటికే హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, కర్నూలులో తన కేంద్రాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కేంద్రానికి అధ్యక్షులుగా చంద్రకాంత్ అగర్వాల్, కార్యదర్శిగా డాక్టర్ సుమన్‌జైన్, వైస్ ప్రెసిడెంట్‌గా కె. రత్నావళి, జాయింట్ సెక్రటరీగా అలీంబిగ్, మనోజ్‌రూపని, చీఫ్ ప్యాట్రన్‌గా నరేష్ రతి, కర్నూలు బ్లడ్ ఆర్గనైజర్‌గా సుమన్, విజయ్, రమేష్, లోకేష్, విరూపాక్షి వ్యవహరించనున్నారు.

రూ.2 కోట్లతో ఈట్ స్ట్రీట్ పనులు



ఈట్ స్ట్రీట్ పనుల ప్రగతిపై ఆరా తీస్తున్న కమిషనర్ భార్గవ్ తేజ

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక బిర్లాగేట్ వద్ద రూ.2 కోట్లతో ఈట్ స్ట్రీట్ పనులు చేపడుతున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక బిర్లాగేట్ వద్ద అందుకు సంబంధించిన పనులపై మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పెయింటింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆటవిడుపు కోసం సాయంత్రం వేళ పిల్లలు, పెద్దలు, కుటుంబ సభ్యుల కోసం ఇక్కడ ఈట్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తిను బండారాలు, పిల్లలు ఆడుకునేందుకు వీలుగా జారుబండ, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్, పార్కింగ్ వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అలాగే స్థానిక జొహరాపురం వద్ద ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఈఈ షాకీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

పని సర్దుబాటును వాయిదా వేయాలి

కర్నూలు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఉపాధ్యాయుల పని సర్దుబాటును వాయిదా వేసి ముందు పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటును నిలిపి వేయాలని కోరుతూ శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఈఓ ఆఫీస్‌ల ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు డీఈఓ ఆఫీస్ దగ్గర జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా పని సర్దుబాటు తీసుకురావడం సరికాదన్నారు. అనంతరం డీఈఓ డా.వి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గోకారి, సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్ప, సభ్యులు జయరాజు, జనార్ధన్, మరియానందం, రంగన్న,శ్రీనివాసయాదవ్, మోయిన్ కృష పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉపయోగపడేలా టేబుల్ క్యాలెండర్



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, ఇతర ఎన్‌జీవో నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగులందరికీ ఉపయోగపడే విధంగా ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండ్‌క్యాప్డ్(బధిరులు) ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా శాఖ 2023 టేబుల్ క్యాలెండర్‌ను రూపొందించడం అభినందనీయమని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. హియరింగ్ హ్యాండ్‌క్యాప్డ్ ఉద్యోగులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ అసోషియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జవహార్‌లాల్, నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఇతర నాయకులు సాంబశివారెడ్డి, నాగరాజు, కేసీహెచ్ కృష్ణుడు, భాస్కరనాయుడు, రవిప్రకాశ్, జిల్లా బధిరుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రఘునాథరెడ్డి, కార్యదర్శి రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగమైతే రికవరీ

- ఉపాధి పనులపై సోషల్ ఆడిట్‌కు రికార్డులు సమర్పించండి
- కన్వర్జెన్సీ సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ శాఖల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిధులు దుర్వినియోగమైతే రికవరీ చేయాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో కన్వర్జెన్సీ డిపార్టుమెంట్ల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో దాదాపు రూ.150 కోట్లకు రికార్డులు ఇవ్వాల్సి ఉందని, వాటిని అందజేస్తే సోషల్ ఆడిట్ నిర్వహణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అటవీ శాఖ, పంచాయతీరాజ్, సెర్ప్‌లో రికార్డులు ఇవ్వడంలో పెండింగ్ ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికే రికార్డులు సమర్పించి సోషల్ ఆడిట్ కూడా పూర్తి అయి ఉంటే పర్సనల్ హియరింగ్ చేపట్టాలని సూచించారు. ఉపాధి నిధులతో గ్రామ సచివాలయాలు,ఆర్‌బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలు నిర్మిస్తున్నామని, వాటి నిర్మాణాల్లో పారదర్శకత కోసమే సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కన్వర్జెన్సీ శాఖల అధికారులతో పాటు డ్వామా విజిలెన్స్ విభాగం హెచ్‌ఆర్ మేనేజర్ షీబారాణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
14-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
303	98
60,261	17,957

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫన్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,978	▼	23
డోజోన్స్	34,193	▲	3
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,844	▲	50
డాక్స్	15,087	▲	28
షాంఘై	3,195	▲	31
నిక్కాయ్	26,120	▼	330

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
56,462	▲	352
బంగారం (99.5 స్వచ్ఛత)		
56,236	▲	351
వెండి (కిలో)		
68,115	▲	90

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		79.50	83.18
£	బ్రిటన్ పౌండ్		96.84	101.69
€	యూరో		85.71	90.23
¥	జపాన్ ఎన్ (100)		50.00	76.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		54.20	59.09
S$	సింగపూర్ డాలర్		59.21	63.76
SAR	సౌదీ రియాల్		20.69	22.36
UAE D	యూఏఈ దిర్హామ్		21.25	23.04
¥	చైనా యువాన్		10.98	13.01

డిజిటల్ వినియోగానికి ఎదురుదెబ్బ: గూగుల్

న్యూఢిల్లీ: గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) తమకు జరిమానా విధించడంపై టెక్ దిగ్గజం గూగుల్ స్పందించింది. కనెక్టివిటీకి అడ్డంకులను తొలగించే దిశగా సురక్షితమైన స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తేవాల్సిన దశలో ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం వల్ల దేశీయంగా డిజిటల్ వినియోగం వేగవంతం కాకుండా విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. గూగుల్ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం విషయంలో గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ రూ. 1,338 కోట్లు, ప్లే స్టోర్‌కి సంబంధించి అనుచిత విధానాలపై మరో రూ. 936 కోట్ల మొత్తాన్ని సీసీఐ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ నుంచి వరి సంరక్షణా పురుగు మందు

హైదరాబాద్: వరి పంట రక్షణ, రైతులకు లాభదాయకత పెంపు లక్ష్యంగా క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సంస్థ మార్కెట్లోకి సరికొత్త పురుగుమందును ఆవిష్కరించింది. పంట సమయంలో చీడపీడలను నియంత్రించడమే కాకుండా, వరి పంట మొత్తాన్ని సురక్షితంగా ఉంచడానికి, దిగుబడిని పెంచడానికి, నాణ్యమైన ఉత్పత్తికి 'మెంటార్' పేరుతో విడుదలైన ఈ ప్రొడక్ట్ దోహదపడుతుందని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన వివరించింది. దేశవ్యాప్తంగా వివిధ అగ్రి విశ్వవిద్యాలయాలలో మెంటర్‌ను పరీక్షించడం జరిగిందని ప్రకటన తెలిపింది. వరి పంట విషయంలో చీడపీడలను అరికట్టడంలో ఇది ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు పేర్కొంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
14-1-2023	
విశాఖ	572-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	563-00
విజయవాడ	563-00
రిటైల్ ధర (డజను)	84.00
13-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	563-00
వరంగల్	565-00
రిటైల్ ధర	6.20

విప్రో లాభం రూ. 3,053 కోట్లు

- క్యూ3 ఫలితాల విడుదల
- ఆదాయం రూ. 23,229 కోట్లు
- 4.3 బిలియన్ డాలర్ల ఆర్డర్లు
- 2,58,744కు మొత్తం సిబ్బంది

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 2.8 శాతం బలపడి రూ. 3,053 కోట్లను తాకింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 2,969 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 14 శాతం ఎగసి రూ. 23,229 కోట్లకు చేరింది. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి ఐటీ సర్వీసుల ఆదాయం 11.5-12 శాతం మధ్య పుంజుకోనున్నట్లు తాజాగా అంచనా(గైడెన్స్) ప్రకటించింది. వాటాదారులకు షేరుకి రూ. 1 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై-సెప్టెంబర్)తో పోలిస్తే నికర లాభం 15 శాతం, ఆదాయం 3 శాతం వృద్ధి చూపాయి.



ఫలితాలను ప్రకటిస్తున్న విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్

డీల్స్ రికార్డ్..

ప్రపంచ అనిశ్చితుల్లోనూ క్యూ3లో రికార్డ్ నెలకొల్పుతూ మొత్తం 4.3 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులు కుదుర్చుకున్నట్లు విప్రో సీఈవో, ఎండీ థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ఇది 26 శాతం వృద్ధికాగా.. వీటిలో బిలియన్ డాలర్ల విలువకు మించిన భారీ ఆర్డర్లను సైతం పొందినట్లు తెలియజేశారు. క్యూ4(జనవరి-మార్చి)లోనూ ఇదే స్థాయి ఆర్డర్లు పొందే వీలున్నట్లు అంచనా వేశారు. క్లయింట్లతో లోతైన సంబంధాల ద్వారా అత్యధిక స్థాయిలో డీల్స్ కుదుర్చుకోగలుగుతున్నట్లు వివరించారు. ట్రాన్స్‌ఫార్మేషన్ లక్ష్యాలు, వ్యయ క్రమబద్ధీకరణ తదితర అంశాలలో క్లయింట్లకు అందిస్తున్న సమర్థవంత సేవలు ఇందుకు దోహదపడుతున్నట్లు తెలియజేశారు. పూర్తిస్థాయి క్లౌడ్ సర్వీసులు, ఇంజనీరింగ్ సర్వీసులు ఆర్డర్‌బుక్‌కు దన్నుగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇతర హైలైట్స్

- క్యూ2తో పోలిస్తే విప్రో ఉద్యోగుల సంఖ్య నికరంగా 435 తగ్గి 2,58,744ను తాకింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 1.8 శాతం తగ్గి 21.2 శాతానికి చేరింది.
- ఐటీ సర్వీసుల నిర్వహణ మార్జిన్లు 1.2 శాతం బలపడి 16.3 శాతానికి చేరాయి.
- ఐటీ సర్వీసుల ఆదాయం 6.2 శాతం వృద్ధితో 280.35 కోట్ల డాలర్లను తాకింది.
- ఐటీ ప్రొడక్టుల ఆదాయం 2.08 కోట్ల డాలర్లు(రూ. 170 కోట్లు)గా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు యథాతథంగా రూ. 396 వద్ద ముగిసింది.

3 రోజుల నష్టాలకు చెక్

ముంబై: ద్రవ్యోల్బణ ఆందోళనలు ఉపశమించిన నేపథ్యంలో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. మెటల్, ఫైనాన్షియల్స్, ఐటీలో కొనుగోళ్ల దేశీ స్టాక్ మార్కెట్లు జోష్‌నిచ్చాయి. వెరసి సెన్సెక్స్ ట్రిపుల్ సెంచరీ చేసి 60,000 మార్క్‌ను అధిగమించింది. 303 పాయింట్లు జమ చేసుకుని 60,261 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 98 పాయింట్లు ఎగసి 17,957 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 460 పాయింట్లు జంప్‌చేయగా.. నిఫ్టీ 18,000 స్థాయికి చేరువైంది. అయితే తొలుత మార్కెట్లు నష్టాలతో ప్రారంభమయ్యాయి. తదుపరి ట్రేడర్లు షార్ట్ కవరింగ్ చేపట్టడంతో మిడ్ సెషన్ నుంచీ జోరందుకున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు.

కన్జూమర్ డ్యూరబుల్స్ వీక్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాలు 1.3-0.6 శాతం మధ్య పుంజుకోగా... కన్జూమర్ డ్యూరబుల్స్ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ఎంటర్, ఇండస్‌ఇండ్, ఐషర్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, దివీస్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, బీపీసీఎల్, ఐసీఐసీఐ, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఎయిర్‌టెల్, మారుతీ, ఎస్‌బీఐ 2-1 శాతం మధ్య బలపడ్డాయి. అయితే టైటన్, ఎస్‌బీఐ లైఫ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే, ఎల్‌అండ్‌టీ 1-0.5 శాతం మధ్య క్షీణించాయి.



స్టాక్ హైలైట్స్

- క్యూ3లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 716 కోట్ల అమ్మకాలు సాధించినట్లు వెల్లడించడంతో రియల్టీ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్ 16% దూసుకెళ్లింది. రూ. 303 వద్ద ముగిసింది. తొలుత రూ. 312ను సైతం అధిగమించింది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి తాజాగా రూ. 1,134 కోట్ల విలువైన ఆర్డర్ పొందడంతో రైల్ వికాస్ నిగమ్(ఆర్‌వీఎన్‌ఎల్) కౌంటర్ 5 శాతం ఎగసి రూ. 80 వద్ద ముగిసింది.
- కొద్ది రోజులుగా ర్యాలీ బాటలో సాగుతున్న ఆర్కియన్ కెమికల్స్ షేరు మరోసారి 8 శాతం జంప్‌చేసి రూ.617 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.629 వద్ద కొత్త గరిష్టాన్ని తాకింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసి పనిచేయాలి

- అవకాశాలను సొంతం చేసుకోవాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- బడ్జెట్‌కు ముందు ఆర్థికవేత్తలతో చర్చలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు రంగం కలసికట్టుగా పనిచేయాలని, అంతర్జాతీయంగా ఉన్న పరిణామాల నేపథ్యంలో తమ పరిధి దాటి విశాల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను సొంతం చేసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రముఖ ఆర్థికవేత్తలతో శుక్రవారం ప్రధాని సమావేశమయ్యారు. వారి అభిప్రాయాలు, సూచనలను తెలుసుకున్నారు. డిజిటల్ కార్యకలాపాల విషయంలో, ఫిన్‌టెక్ విస్తరణలో దేశం సాధించిన విజయాన్ని ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించినట్టు అధికారికంగా ఓ ప్రకటన విడుదలైంది. సమ్మిళిత వృద్ధికి ఇది కీలకమని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ వృద్ధిలో మహిళల పాత్ర కీలకమని పేర్కొంటూ, ఉత్పాదకతలో మహిళలను మరింతగా భాగస్వాములను చేయాలని కోరారు. రిస్కులు ఉన్నప్పటికీ అంతర్జాతీయంగా డిజిటైజేషన్, ఇంధనం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం రంగాల్లో విస్తతమైన అవకాశాలున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. ఈ అవకాశాలను సొంతం చేసుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భారత్ తన వృద్ధిని స్థిరంగా కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ఆర్థికవేత్తలు ఈ సమావేశంలో ప్రధానికి సూచించినట్టు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న సమస్యలు కొనసాగుతాయంటూ, భారత్ మరింత బలమైన వృద్ధిని నమోదు చేసేందుకు చర్యలను ప్రతిపాదించినట్టు పేర్కొంది. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ, ఉన్నతాధికారులతోపాటు.. ఆర్థికవేత్తలు శంకర్ ఆచార్య, అశోక్ గులాటీ, షమిక రవి తదితరులు పాల్గొన్నారు.



ఇతర రంగాలకూ పీఎల్ఐ స్కీమ్

- రానున్న సంవత్సరాల్లో వచ్చే చాన్స్
- బడ్జెట్‌లో డిమాండ్ బలోపేతానికి చర్యలు
- పరిశ్రమ వర్గాల ఆశాభావం

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం ఎంతో ప్రయోజనకరమని మెజారిటీ వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో పీఎల్ఐ కింద ఇతర రంగాలకూ ప్రోత్సాహకాలు లభిస్తాయన్న ఆశాభావం వారి నుంచి వ్యక్తమైంది. డిమాండ్ బలోపేతానికి వీలుగా బడ్జెట్‌లో ప్రకటించే చర్యలు అన్ని రంగాల్లో వృద్ధికి ఊతంగా నిలుస్తాయన్న అభిప్రాయం కంపెనీల ప్రతినిధుల్లో వ్యక్తమైంది. మూలధన వ్యయాలపైనా బడ్జెట్ దృష్టి సారిస్తుందని అంచనా వేస్తున్నారు. డెలాయిట్ సర్వే వివిధ రంగాల్లోని పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను తెలుసుకుంది. మూలధన వ్యయాలు, మౌలిక సదుపాయాలకు రుణాలను అందించడం వృద్ధికి కీలకమన్న అభిప్రాయం వ్యక్తమైంది. భారత ప్రభుత్వ బాండ్ల ద్వారా నిధులు సమీకరించాలని సర్వేలో 60 శాతం మంది సూచించారు. రానున్న బడ్జెట్ నుంచి పరిశ్రమ ఏమి ఆశిస్తుందో తెలుసుకునే ప్రయత్నం సర్వేలో భాగంగా డెలాయిట్ చేసింది. 10 రంగాల నుంచి 181 మంది ప్రతినిధులు సర్వేలో పాల్గొని అభిప్రాయాలు తెలియజేశారు.



పారిశ్రామికవేత్తల అభిప్రాయాలు

- 70 శాతానికి పైగా పరిశ్రమల ప్రతినిధులు పీఎల్ఐ పథకం తమ రంగం వృద్ధికి మేలు చేస్తుందని చెప్పారు.
- 60% మంది పీఎల్ఐ ప్రోత్సాహకాలను మరిన్ని రంగాలకు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు.
- పన్నుల్లో మార్పులు తెస్తే అది పరిశ్రమల వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న బడ్జెట్‌లో ఎక్కువ మంది బలంగా దీన్ని కోరుకుంటున్నారు.
- ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు పెట్టుబడుల వృద్ధికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.
- ఎంఎస్ఎంఈలను జీవీసీ కిందకు తీసుకొస్తే పరిశ్రమల వృద్ధి స్థిరత్వానికి సాయపడుతుందని, వాణిజ్య లావాదేవీలు పెరుగుతాయని చెప్పారు.
- 45 శాతం మంది పన్ను బాధ్యతలను ప్రభుత్వం తగ్గిస్తుందని అంచనా వేస్తుంటే, 44 శాతం మంది టీడీఎస్‌కు సంబంధించి స్పష్టత కోరుకుంటున్నారు.
- మూలధన లాభాల పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరంగా మార్చాలని పరిశ్రమ కోరుతోంది.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 14 రంగాలకు పీఎల్ఐ కింద రూ. 2 లక్షల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించింది. తోలు, సైకిల్, టీకాల తయారీ, టెలికం ఉత్పత్తులకు పీఎల్ఐ విస్తరణ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ

దక్షిణాఫ్రికా వేదికగా నేటి నుంచి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. 16 జట్లు తలపడుతున్న ఈ టోర్నీ ఈనెల 29న జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. గ్రూప్ 'ఎ'లో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, శ్రీలంక, అమెరికా; గ్రూప్ 'బి'లో ఇంగ్లండ్, పాకిస్తాన్, జింబాబ్వే, రువాండా; గ్రూప్ 'సి'లో ఇండోనేసియా, ఐర్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్; గ్రూప్ 'డి'లో భారత్, దక్షిణాఫ్రికా, స్కాట్లాండ్, యూఏఈ జట్లున్నాయి. నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. భారత జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష, వైజాగ్‌కు చెందిన షబ్నమ్ సభ్యులుగా ఉన్నారు.

టెన్నిస్‌కు సానియా గుడ్‌బై

వచ్చే నెలలో రిటైర్ కానున్న భారత స్టార్

మెల్‌బోర్న్: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫిబ్రవరిలో జరిగే దుబాయ్ ఓపెన్ తర్వాత రిటైర్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో భావోద్వేగపు లేఖను 'లైఫ్ అప్‌డేట్' అనే క్యాప్షన్‌తో పంచుకుంది. మూడు పేజీల ఈ లేఖలో తన 30 ఏళ్ల రాకెట్ పయనాన్ని, చివరి గమ్యాన్ని వివరించింది. 'నా గ్రాండ్‌స్లామ్ ప్రయాణం 2005లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌తోనే మొదలైంది. ఇప్పుడు గ్రాండ్‌స్లామ్ ఆట కూడా అక్కడే ముగించేందుకు సరైన వేదిక అనుకుంటున్నా. 18 ఏళ్ల క్రితం ఎక్కడైతే ఆరంభించానో అక్కడే ఆపేయబోతున్నా. ఇక కెరీర్‌లో చివరి టోర్నీ మాత్రం దుబాయ్ ఓపెన్. ఫిబ్రవరిలో ఈ టోర్నీతో సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాను. ఇన్నేళ్ల పయనంలో ఎన్నో ఆటుపోట్లే కాదు మరెన్నో మధురస్మృతులూ ఉన్నాయి' అని అందులో పేర్కొంది. నాసర్ స్కూల్‌కు చెందిన ఆరేళ్ల బాలిక ఎలా టెన్నిస్ నేర్చుకుంది... తన కలలకు ఎక్కడ బీజం పడింది... అన్నింటికీ మించి దేశానికి ప్రాతినిధ్యం ఎలాంటి స్ఫూర్తినిచ్చిందో ఆ లేఖలో చెప్పుకొచ్చింది. అర్ధ సెంచరీని దాటిన తన గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో గెలిచిన కొన్ని టైటిళ్లు దేవుడిచ్చిన వరమంది. 'నా సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి పతకాలు తేవడమే అతిపెద్ద గౌరవంగా భావిస్తాను. పతకం నా మెడలో పడినపుడు జాతీయ పతాకం రెపరెపలాడినపుడు కలిగే ఆనందం అన్నింటికి మించి ఉంటుంది. ఇప్పుడు దీన్ని తలచుకొని రిటైర్మెంట్ సందేశం రాస్తున్నప్పుడు చెరిగిపోని ఆ అనుభూతి నా కళ్లను చెమరుస్తోంది' అని 36 ఏళ్ల సానియా పేర్కొంది.



భారత్ శుభారంభం

నాలుగోసారి ప్రపంచకప్ పురుషుల హాకీ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న భారత జట్టు ఆనవాయితీని కొనసాగించింది. స్వదేశంలో జరిగిన గత మూడు ప్రపంచకప్‌లలో భారత జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. నాలుగోసారీ ఈ ఫలితంలో మార్పు లేకుండా చూసుకున్న టీమిండియా ఈ మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసింది. 48 ఏళ్లుగా ఊరిస్తున్న ప్రపంచకప్ టైటిల్ వేటను విజయంతో మొదలుపెట్టింది.

- తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌పై 2-0తో విజయం
- ప్రపంచకప్ హాకీ టోర్నీ

రూర్కెలా (ఒడిశా): సొంతగడ్డపై తమ సత్తా చాటుకుంటూ భారత పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్ టోర్నీలో బోణీ కొట్టింది. స్పెయిన్ జట్టుతో శుక్రవారం జరిగిన పూల్ 'డి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. ఆట 12వ నిమిషంలో వైస్ కెప్టెన్ అమిత్ రోహిదాస్... 26వ నిమిషంలో హార్దిక్ సింగ్ ఒక్కో గోల్ సాధించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆద్యంతం భారత్ ఆధిపత్యం చలాయించిన ఈ మ్యాచ్‌లో టీమిండియాకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు రాగా... స్పెయిన్ మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించింది. భారత్ ఐదు పెనాల్టీ కార్నర్‌లలో ఒక దానిని సద్వినియోగం చేసుకోగా... స్పెయిన్ మూడింటినీ వృథా చేసుకుంది. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.

స్పెయిన్‌తో మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యాన్ని కనబరిచింది. అవకాశం దొరికినపుడల్లా భారత ఆటగాళ్లు నీలకంఠ శర్మ, మన్‌దీప్ సింగ్, ఆకాశ్‌దీప్ సింగ్, అభిషేక్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా స్పెయిన్ అప్రమత్తంగా ఉంటూ వాటిని నిలువరించింది. లేదంటే భారత్ ఖాతాలో మరిన్ని గోల్స్ చేరేవి. 12వ నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్ చేయగా... బంతి స్పెయిన్ డిఫెండర్‌కు తగిలి వెనక్కి వచ్చింది. అక్కడే ఉన్న అమిత్ రోహిదాస్ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. అనంతరం 26వ నిమిషంలో ఎడమ వైపు నుంచి హార్దిక్ సింగ్ దూసుకొస్తూ అదే జోరులో క్రాస్ షాట్‌తో బంతిని స్పెయిన్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. దాంతో భారత ఆధిక్యం 2-0కు పెరిగింది. మూడో క్వార్టర్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను వృథా చేయడం గమనార్హం. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో అర్జెంటీనా 1-0తో దక్షిణాఫ్రికాపై... మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా 8-0తో ఫ్రాన్స్‌పై గెలుపొందగా... పూల్ 'డి'లోని మరో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 5-0తో వేల్స్ జట్టును ఓడించింది.



అమిత్ రోహిదాస్

8 ప్రపంచకప్ టోర్నీలలో తాము ఆడిన తొలి మ్యాచ్ లో భారత్ గెలుపొందడం ఇది ఎనిమిదో సారి. 15వసారి ప్రపంచకప్ జరుగుతుండగా... భారత్ రెండుసార్లు తమ తొలి మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, ఐదుసార్లు తమ తొలి మ్యాచ్‌లో ఓడిపోయింది.

సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ ద్వయం 17-21, 22-20, 21-9తో లియు యు చెన్-జువాన్ యి ఒయు (చైనా) జోడీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 16-21, 21-19, 12-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ప్రణయ్‌కు 6,875 డాలర్ల (రూ. 5 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 6,600 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఆంధ్ర జట్టుకు నిరాశ

ఢిల్లీకి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

న్యూఢిల్లీ: చివరి వికెట్ తీయడంలో విఫలమైన ఆంధ్ర జట్టు బౌలర్లు ఢిల్లీ జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయారు. మ్యాచ్ 'డ్రా'గా ముగిసినా 29 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించినందుకు ఢిల్లీ జట్టుకు మూడు పాయింట్లు లభించగా... ఆంధ్ర ఖాతాలో ఒక పాయింట్ మాత్రమే చేరింది. ఓవర్‌నైట్ స్కోరు 300/4తో ఆట చివరిరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఢిల్లీ జట్టు 9 వికెట్లకు 488 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో ధ్రువ్ షోరే మరో 43 పరుగులు జోడించి వ్యక్తిగత స్కోరు 185 వద్ద అవుటవ్వగా... హిమ్మత్ సింగ్ (104; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హిమ్మత్ సింగ్ అవుటైనపుడు ఢిల్లీ స్కోరు 423/9. చివరి వికెట్ తీసిఉంటే ఆంధ్ర జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతోపాటు మూడు పాయింట్లు లభించేవి. కానీ ఢిల్లీ బ్యాటర్లు హర్షిత్ రాణా (46 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), దివిజ్ మెహ్రా (38 బంతుల్లో 32 నాటౌట్; 6 ఫోర్లు) మొండి పట్టుదలతో ఆడి చివరి వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించారు. ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఆంధ్ర గ్రూప్ 'బి' 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.



హిమ్మత్

భారత టెస్టు జట్టులోకి సూర్యకుమార్

- ఇషాన్ కిషన్‌కు తొలిసారి పిలుపు
- ఆసీస్‌తో తొలి రెండు టెస్టులకు జట్టు ప్రకటన

ముంబై: ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై జరిగే 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లోని తొలి రెండు టెస్టుల కోసం 17 మంది సభ్యులతో భారత జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20లో తన విధ్వంసక ఆటతో చెలరేగుతున్న సూర్యకుమార్ యాదవ్ తొలిసారి టెస్టు టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు టెస్టుల్లో అవకాశం రాకపోయినా ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లోనూ సూర్యకు మంచి రికార్డే ఉంది. 79 మ్యాచ్‌లలో అతను 44.75 సగటుతో 5549 పరుగులు చేయగా, ఇందులో 14 సెంచరీలు ఉన్నాయి. మరో వైపు కారు ప్రమాదానికి గురైన వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇప్పట్లో కోలుకునే అవకాశం లేకపోవడంతో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను ఎంపిక చేశారు. ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ ఇప్పటికే టెస్టు టీమ్‌తో ఉండగా (ఇంకా మ్యాచ్ ఆడలేదు), కిషన్‌కు టెస్టుల్లో ఇదే తొలి అవకాశం. బుమ్రాను ఎంపిక చేయకపోవడంతో అతను పూర్తిగా కోలుకోలేదని తేలింది. గాయం నుంచి కోలుకుంటున్న రవీంద్ర జడేజానూ జట్టులోకి తీసుకున్నా... ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే ఆడతాడు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఫిబ్రవరి 9నుంచి నాగపూర్‌లో తొలి టెస్టు జరుగుతుంది.

టెస్టు జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), రాహుల్, గిల్, పుజారా, కోహ్లి, శ్రేయస్, కేఎస్ భరత్, ఇషాన్ కిషన్, అశ్విన్, అక్షర్, కుల్దీప్, జడేజా, షమీ, సిరాజ్, ఉమేశ్, ఉనాద్కట్, సూర్యకుమార్.



సూర్య, ఇషాన్

న్యూజిలాండ్‌దే సిరీస్


కరాచీ: పాకిస్తాన్ గడ్డపై మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు తొలిసారి సొంతం చేసుకుంది. పాకిస్తాన్‌తో శుక్రవారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ రెండు వికెట్ల తేడాతో గెలిచింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో దక్కించుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (101; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. మొహమ్మద్ రిజ్వాన్ (77; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. కివీస్ బౌలర్లలో టిమ్ సౌతీ (3/56) ఆకట్టుకున్నాడు. అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 281 పరుగులు చేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' డెవాన్ కాన్వే (52; 5 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (53; 2 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (42 బంతుల్లో 63 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించి న్యూజిలాండ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో సిరీస్ ముగించుకున్న న్యూజిలాండ్ ఈనెల 18 నుంచి భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది.

టి20లకు పృథ్వీ షా, వన్డేల్లో భరత్

న్యూజిలాండ్‌తో సిరీస్‌లకు భారత జట్లు

ముంబై: ఏడాదిన్నర క్రితం అంతర్జాతీయ టి20ల్లో తాను ఆడిన ఏకైక టి20లో తొలి బంతికే అవుటైన పృథ్వీ షా భారత జట్టులోకి పునరాగమనం చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం సెలక్టర్లు అతడికి అవకాశం కల్పించారు. ఇది మినహా చెప్పుకోదగ్గ మార్పులేమీ లేకుండా ఇటీవల శ్రీలంకతో టి20 సిరీస్ గెలిచిన జట్టునే ఎంపిక చేశారు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌లో కూడా రోహిత్, కోహ్లిలను ఎంపిక చేయకపోవడంతో అది 'విశ్రాంతి'నా లేక టి20 భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా వారిని పక్కన పెట్టేశారా అనేదానిపై స్పష్టత లేదు. జనవరి 27, 29, ఫిబ్రవరి 1 తేదీల్లో టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. వన్డే జట్టులో ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి అవకాశం లభించింది. శార్దుల్ ఠాకూర్ పునరాగమనం చేయగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ షహబాజ్ అహ్మద్‌కు కూడా చోటు కల్పించారు. వన్డేల్లో మాత్రం రోహిత్, కోహ్లి అందుబాటులో ఉంటారు. వ్యక్తిగత కారణాలతో కేఎల్ రాహుల్, అక్షర్‌లను రెండు జట్లలోనూ ఎంపిక చేయలేదని సెలక్టర్లు వెల్లడించారు. ఈ నెల 18, 21, 24 తేదీల్లో వన్డేలు జరుగుతాయి.

వన్డే జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, సూర్యకుమార్, భరత్, హార్దిక్, సుందర్, షహబాజ్, శార్దుల్, చహల్, కుల్దీప్, షమీ, సిరాజ్, ఉమ్రాన్. **టి20 జట్టు:** హార్దిక్ (కెప్టెన్), సూర్యకుమార్, ఇషాన్ కిషన్, రుతురాజ్, గిల్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, జితేశ్ శర్మ, సుందర్, కుల్దీప్, చహల్, అర్ష్‌దీప్, ఉమ్రాన్, మావి, పృథ్వీ షా, ముకేశ్ కుమార్.



భరత్